# విశాల భారతి

తెలుగు దిన పత్రిక సంపుటి:3 సంచిక:139

epaper:vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ 10.03.2025

24 క్యారెట్లు 87,215.00 | కిలో వెండి 1,07,775.00 | 32 °C

www.vishalabharati.com




## కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టిన రోహిత్

# చక్ దే ఇండియా

## ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ జయకేతనం

- ఫైనల్లో న్యూజిలాండ్‌పై గ్రాండ్ విక్టరీ
- మరోసారి స్పిన్నర్ల మాయాజాలం
- దేశవ్యాప్తంగా అభిమానుల సంబరాలు
- ఇది అసాధారణ గెలుపు
- టీమిండియాకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

..మిగతా 3 లో

2025 ఛాంపియన్స్ ట్రోఫీని టీం ఇండియా గెలుచుకుంది. రోహిత్ శర్మ కెప్టెన్సీలో, భారత జట్టు 9 నెలల్లో రెండవ ట్రోఫీని అందుకుంది. 2024 టీ20 ప్రపంచ కప్ టైటిల్ గెలిచిన తర్వాత, రోహిత్ కెప్టెన్సీలో టీం ఇండియా 12 సంవత్సరాల తర్వాత మళ్లీ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. మార్చి 9వ తేదీ ఆదివారం దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో, అద్భుతమైన బౌలింగ్, కెప్టెన్ రోహిత్ శర్మ బలమైన ఇన్నింగ్స్ సహాయంతో టీమ్ ఇండియా న్యూజిలాండ్‌ను 4 వికెట్ల తేడాతో ఓడించింది. దీంతో, 25 ఏళ్ల క్రితం ఇదే టోర్నమెంట్ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఓటమికి టీం ఇండియా ప్రతీకారం తీర్చుకుంది. దీనితో పాటు, అతను ఈ ట్రోఫీని గరిష్టంగా గెలుచుకున్న రికార్డును కూడా భారత్ సృష్టించింది.

## “ గర్వంతో ఉప్పొంగిపోయాం

### టీమిండియా విజయంపై ప్రముఖుల ప్రశంసలు

## భారత జట్టు ఆట అద్భుతం

టీమిండియాకు ప్రధాని మోదీ, సీఎం రేవంత్ శుభాకాంక్షలు పేజీ 2



2 లో

## అడుగంటుతున్న సాగర్, శ్రీశైలం

- వేగంగా తగ్గుతున్న నీటి నిల్వలు
- ఏప్రిల్, మేలలో ఇంకా తగ్గే ఛాన్స్
- తాగునీటి అవసరాలపై ఆందోళన



2026 మార్చి నుంచి కాజీపేటలో

## కోచ్‌ల ఉత్పత్తి

- 65 శాతం పనులు పూర్తి
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

2 లో

## చేనేత కార్మికులకు రుణమాఫీ

- రూ.33 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఒక్కో కార్మికుడికి లక్ష రూపాయలు

2 లో







## ఎమ్మెల్సీ అభ్యర్థులు ఫైనల్

### ఖరారు చేసిన పార్టీలు

- కాంగ్రెస్ 3, సీపీఐ 1, బీఆర్ఎస్ 1
- కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్ , శంకర్ నాయక్, విజయశాంతి
- అనూహ్యంగా తెరమీదకు వచ్చిన రాములమ్మ
- సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం
- బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్
- నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు
- నాలుగు సీట్లు నల్లగొండ జిల్లాకే

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 3 పార్టీలూ అనూహ్యంగా అభ్యర్థిత్వాలను ప్రకటించాయి. కాంగ్రెస్ తన అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్‌లను ప్రకటించింది. ఇక, ఎప్పటి నుంచో అధ్యక్షా.. అనాలని కోరుకుంటున్న దాసోజు శ్రవణ్‌ను బీఆర్ఎస్ ఎంపిక చేసింది. మిత్రపక్షం సీపీఐకి కాంగ్రెస్ ఇచ్చిన సీటులో నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. ఈసారి విశేషం ఏమిటంటే.. నల్లగొండ జిల్లా జాక్‌పాట్ కొట్టడం. ఆ జిల్లాకు చెందిన

..మిగతా 2 లో

# మోడీ మెడపై కులగణన కత్తి

## బీసీలకు 42% రిజర్వేషన్లు దక్కకుండా కుట్ర



- మొగ్గలోనే తుంచేందుకు ప్రయత్నిస్తున్నారు
- బీఆర్ఎస్, బీజేపీలది తొండి వాదన
- కులగణన సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారు
- తప్పులు చూపించమంటే పారిపోతున్నారు
- బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రధాని మోదీ మెడకు చుట్టుకుంటుందని బీజేపీ నేతల భయం
- పద్మశాలీలు ఆత్మగౌరవానికి, త్యాగానికి ప్రతీక
- తెలంగాణ ఉద్యమంలో బాపూజీది కీలకపాత్ర
- ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీకి ఆయన పేరు
- పద్మశాలి మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: వెనకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా మొగ్గలోనే తుంచేయాలనే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో తాము కులగణన సర్వే చేపడితే.. ఇది నచ్చనివారు దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తద్వారా బడుగు, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు రాకుండా మొగ్గలోనే తుంచేసేందుకు, బీసీల గొంతు నులిమేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ కుట్రలను బీసీ సమాజం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తమ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని స్పష్టం చేశారు. 2011లో సోనియాగాంధీ అధ్యక్షతన కులగణన చేస్తే తర్వాత వచ్చిన బీజేపీ ప్రభుత్వం

..మిగతా 2 లో

# టన్నెల్ నుంచి మృతదేహం వెలికితీత

- టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌గా నిర్ధారణ
- 16 రోజుల అన్వేషణలో తొలి గుర్తింపు
- సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌ల సంతాపం
- బాధిత కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం
- అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలభారతి, స్టేట్ బ్యూరో: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చేపట్టిన రెస్క్యూ ఆపరేషన్ 16వ రోజైన ఆదివారం కొలిక్కి వచ్చింది. టన్నెల్‌లో గల్లంతైన 8 మందిలో ఒకరి మృతదేహాన్ని రెస్క్యూ బృందాలు వెలికితీశాయి. మృతుడు టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ (40)గా గుర్తించారు. ఇంకా ఏడుగురి కోసం సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. క్యాడవర్ జాగిలాల ద్వారా గుర్తించిన మానవ అవయవాల అన్వేషణలో భాగంగా మట్టి తొలగింపుతో తొలుత చేయి, కాలు భాగాలను గుర్తించారు. 12 గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీసి, టన్నెల్‌లోనే



ప్యాకింగ్ చేసి, లోకోట్రైన్ ద్వారా వెలుపలికి తీసుకొచ్చారు. కుడి చేతికి ఉన్న కడియం ద్వారా అతడిని గురుప్రీత్‌సింగ్‌గా

..మిగతా 2 లో

# గోదావరి పుష్కరాలు వచ్చేస్తున్నాయ్

- 2027 జులై 23 నుంచి ప్రారంభం
- రాష్ట్రంలో బాసర నుంచి భద్రాచలం వరకు నదీతీరం
- 106 పుష్కరఘాట్ల ఆధునికీకరణ
- రూ.50 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని దేవాదాయశాఖ వినతి



# అడుగంటుతున్న సాగర్, శ్రీశైలం

**వేగంగా తగ్గుతున్న నీటి నిల్వలు**
**ఏప్రిల్, మేలలో మరింత తగ్గే ఛాన్స్**
**తాగునీటి అవసరాలపై ఆందోళన**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కృష్ణా నదిపై ఉన్న సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లలో రోజురోజుకూ నీటిమట్టం తగ్గిపోతోంది. ఎండ తీవ్రత పెరగడంతో వేగంగా నీళ్లు అడుగంటుతున్నాయి. మార్చిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మేలలో ఎలా ఉంటుందన్న ఆందోళన నెలకొంది. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 525 అడుగులకు చేరింది. మార్చి నెల మొదటి వారంలోనే ఈ స్థాయిలో నీటిమట్టం తగ్గడంపై ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం సాగర్‌కింద 6.30 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా వారబందీ పద్ధతిలో నీరు విడుదల చేస్తున్నారు. ఈ మార్చి నెలతో పాటు ఏప్రిల్‌నెలంతా నీరు అందితే తప్ప పంటలు చేతికివచ్చే పరిస్థితి లేదు. సెప్టెంబర్ 15 నుంచి రెండు రాష్ట్రాలకు నిరంతరాయంగా నీటి విడుదల కొనసాగుతుండడంతో పాటు పెరుగుతున్న ఎండల వల్లే నీటిమట్టం గణనీయంగా తగ్గుతున్నట్లు తెలిసింది. ఇక శ్రీశైలంలో పరిస్థితి ఇలాగే ఉంది. ఈ రెండు ప్రాజెక్టుల్లో ప్రస్తుతం వాడుకోవడానికి ఉన్న నీళ్లు కేవలం 42.5 టీఎంసీలు మాత్రమే. బోర్డు మీటింగ్ జరిగిన తరువాత ఫిబ్రవరి 27న రెండు ప్రాజెక్టుల్లో వాడుకోవడానికి 65.2 టీఎంసీల నీళ్లున్నాయి. ఈ 10 రోజుల్లోనే రెండు ప్రాజెక్టుల నుంచి 20 టీఎంసీల నీళ్లు ఖాళీ అయ్యాయి.

# చేనేత కార్మికులకు రుణమాఫీ

- **రూ.33 కోట్లు మంజూరు**
- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**
- **ఒక్కో కార్మికుడికి లక్ష రూపాయలు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. లక్ష లోపు ఉన్న చేనేత రుణాలను మాఫీ చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం రూ.33 కోట్లు మంజూరి చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా జౌళి శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో చిన్నచూపుకు గురైన చేనేత రంగాన్ని సంవత్సరం కాలంలో మా ప్రభుత్వం తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకొన్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వ శాఖలు tgsco నుండి బట్టలు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. చేనేత రంగంలో వస్తున్న నూతన టెక్నాలజీ, స్కిల్స్ ను ఎప్పటికప్పుడు అప్ గ్రేడ్ చేసుకునేవిధంగా కొండ లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ స్థాపించుకొన్నామన్నారు. ఇందులో ప్రతి సంవత్సరం 60 మంది విద్యార్థులకు మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు అందించబడుతుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చేనేత అభయహస్త పథకాన్ని కూడా అమలుచేయడానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి అన్నారని ఆయన తెలిపారు. నేతన్న బీమా పథకం కింద పది లక్షల రూపాయల బీమా కల్పిస్తూ, వయోపరిమితిని తొలగించి, నేతన్న వృత్తిలో ఉన్నంతకాలం బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనన్నారు.

# భారత జట్టు ఆట అద్భుతం

- **ఇది అసాధారణ మ్యాచ్.. అసాధారణ ఫలితం**
- **టీమిండియాకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు**
- **భారత్ సత్తాను చాటి చెప్పారు**
- **భారత జట్టుకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ2025 విజేతగా నిలిచిన టీమిండియాకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. ''ఛాంపియన్స్ ట్రోఫీ సాధించిన భారత జట్టుకు అభినందనలు. భారత్‌కు ఛాంపియన్స్ ట్రోఫీ అందించినందుకు గర్వంగా ఉంది. ఛాంపియన్స్ ట్రోఫీ ఆసాంతం భారత జట్టు అద్భుతంగా ఆడింది. ఇది అసాధారణ మ్యాచ్.. అసాధారణ ఫలితం. టోర్నీలో ఆల్ రౌండ్ ప్రతిభను ప్రదర్శించిన భారత జట్టుకు శుభాకాంక్షలు'' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో టీమిండియా విజయంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టుకు అభినందనలు. భారత్ మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచింది. భారత జట్టుకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని కోరుకుంటున్నా'' అని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా టీమిండియాకు అభినందనలు తెలిపారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించటం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తమ అద్భుత ఆటతీరుతో టీమిండియా మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా భారత్ సత్తాను చాటి చెప్పిందన్నారు. భారత జట్టులోని ఆటగాళ్లందరికీ సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలిపారు.

# 2026 మార్చి నుంచి కాజీపేటలో కోచ్‌ల ఉత్పత్తి

- **65 శాతం పనులు పూర్తి**
- **కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి**



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో 2026 మార్చి నుంచి రైలు కోచ్‌ల ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతినెలా 50 చొప్పున ఏడాదికి 600 ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కోచ్‌లు, వ్యాగన్ల ఉత్పత్తి, మరమ్మతు చేసే ఈ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు రూ.716 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇప్పటివరకు 65 శాతం పనులు పూర్తయ్యాయని, దాదాపు రూ.360 కోట్ల నిధులు ఖర్చయ్యాయని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 'కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ దేశ రైలు కోచ్‌ల తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. వరంగల్ ప్రాంత ఆర్థికాభివృద్ధికీ దోహదం చేస్తుంది. ఇక్కడ ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో పాటు ఇంజిన్ ప్రత్యేకంగా అవసరం లేని ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లు (ఈఎంయూ) ఉత్పత్తి అవుతాయి. నెలకు రెండేసి ఈఎంయూ ఉత్పత్తి అవుతాయి. ఒక్కో దాంట్లో 12 బోగీలు ఉంటాయి. ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లు ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లే. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, ఈఎంయూలతో పాటు గూడ్సు రైళ్ల వ్యాగన్లూ ఉత్పత్తి అవుతాయి. ఏడాదికి 2,400 వ్యాగన్ల ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. 160 ఎకరాల్లో నిర్మిస్తున్న యూనిట్‌లో 60,753 చ.మీ. విస్తీర్ణంలో ప్రీఇంజినీర్డ్ భవనాలు వస్తాయి' అని కేంద్ర మంత్రి వివరించారు.

## గోదావరి పుష్కరాలు వచ్చేస్తున్నాయ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** గోదావరి పుష్కరాలు 2027 జులై 23 నుంచి నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడంపై దేవాదాయశాఖ దృష్టి సారించింది. శాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్‌తోపాటు పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాశ్‌రెడ్డి ఇటీవల ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లి మహాకుంభమేళాకు అక్కడ అనుసరించిన విధానాలను అధ్యయనం చేశారు. పుష్కరాల్లో కీలకమైన పుణ్యస్నానాలకు రాష్ట్రవ్యాప్తంగా నదీతీరం వెంబడి ఉన్న 106 పుష్కరఘాట్లను ఆధునికీకరించడంతోపాటు కొత్తవి నిర్మించాలని నిర్ణయించారు. అలాగే ఆయా ఆలయాల ప్రాంతాల్లో భక్తుల తాకిడికి తగ్గట్లుగా సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ పనులకు రూ.50 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా గుర్తించిన దేవాదాయశాఖ రానున్న రాష్ట్ర బడ్జెట్(2025-26)లో కేటాయించాలని ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్కకు విజ్ఞప్తి చేసింది. ఈ ప్రతిపాదనల్లోనే పుష్కరాలు 2027 జులై 23 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2015లో తొలిసారి గోదావరి పుష్కరాలు జరిగాయి. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ సమీపంలో జన్మించే గోదావరి తెలంగాణలో బాసర నుంచి భద్రాచలం వరకు ప్రవహిస్తుంది. తీరం వెంబడి బాసర, ధర్మపురి, మంథని, కాళేశ్వరం, పర్ణశాల, భద్రాచలం వంటి అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి.

# మోడీ మెడపై కులగణన కత్తి



తరువాయి భాగం

నేటివరకు తొక్కిపెట్టిందని విమర్శించారు. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా జోడో యాత్ర అనంతరం కులగణన చేసి తీరుతామని ప్రకటించిన నేపథ్యంలో ఈ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కత్తి ప్రధాని మోదీ మెడకు చుట్టుకుంటుందని బీజేపీ నేతల భయపడుతున్నారని అన్నారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 17వ అఖిల భారత పద్మశాలి, 8వ తెలంగాణ ప్రాంత పద్మశాలి మహాసభలు నిర్వహించారు. ఈ సభలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పద్మశాలీలు ఆత్మగౌరవానికే కాకుండా త్యాగానికి సైతం మారుపేరు అని, కొండా లక్ష్మణ్ బాపూజీయే అందుకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీది కీలక పాత్ర అని, ఆయన ఎన్నో త్యాగాలు చేశారని కొనియాడారు. ఆసిఫాబాద్‌లో నిర్మిస్తున్న మెడికల్ కాలేజీకి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెడుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే టెక్స్‌టైల్ యూనివర్సిటీకి లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమం కోసం జలదృశ్యంలోని తన ఇంటిని ఇచ్చిన గొప్ప వ్యక్తి బాపూజీ అని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించామని చెప్పుకొంటున్న ఓ రాజకీయ పార్టీకి ఆనాడు నెక్లెస్ రోడ్‌లోని తన ఇల్లునే కేటాయించిన ఘనత లక్ష్మణ్ బాపూజీది అని అన్నారు. అటువంటి మహనీయుడు మరణిస్తే మాజీ సీఎం కనీసం చూడడానికి కూడా రాకపోవడం శోచనీయమన్నారు. పద్మశాలీల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఇక్కడే స్పష్టమవుతోందని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆలె నరేంద్ర, కొండా లక్ష్మణ్ బాపూజీల ఉద్యమం వల్ల పద్మశాలీలకు పేరొస్తుందని టైగర్ నరేంద్రను ధృతరాష్ట్ర కౌగిలిలో ఖతం చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో రైతన్నలకు ఇస్తున్న ప్రాధాన్యం నేతన్నలకు కూడా ఇస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. తనను ఆశీర్వదించిన కుటుంబాలకు ఏదైనా చేయాలనే తపనతో ఉన్నానన్నారు. తనను గుండెల్లో పెట్టుకుంటున్న నేతన్నల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నాసిరకం చీరలను కొనుగోలు చేయడమే కాకుండా.. డబ్బులు కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. నేతన్నలకు ప్రభుత్వ ఆర్డర్లను రద్దు చేసిన అప్రతిష్ఠ ఉండొద్దని తాను భావించానని, మహిళా సంఘాల్లోని వారికి రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. 65 లక్షల మంది మహిళలకు రెండు చొప్పున 1.30 కోట్ల చీరలు నేసే ఆర్డర్లను రాష్ట్ర నేతన్నలకు ఇస్తున్నామని ప్రకటించారు. ఇందుకోసం రూ.600కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోలాపూర్‌లో నేతన్నల కోసం నిర్మిస్తున్న మార్కండేయ భవన్‌కు తెలంగాణ ప్రభుత్వం తరపున రూ.కోటి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఇ.అనిల్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు కామార్తపు మురళి !పాల్గొన్నారు.

**కులగణన అందుకే..**

భారత్ జోడో యాత్రలో బలహీన వర్గాల కష్టాలను రాహుల్ గాంధీ చూశారని సీఎం రేవంత్ అన్నారు. కులగణన చేసి జనాభా దామాషాలో బీసీలకు న్యాయం చేయాలనేది రాహుల్ ఆశయమని చెప్పారు. రాష్ట్రంలో లక్ష మంది ఎన్యుమరేటర్లను నియమించి పకడ్బందీగా కులగణన నిర్వహిస్తే కొంతమంది దానిని తప్పుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు ఎక్కడ జరిగిందో నిరూపించమంటే మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదని, బీజేపీ, బీఆర్ఎస్ పారిపోయాయని అన్నారు. కులగణన తప్పు అంటే బడుగు, బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఎప్పటికీ రావనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు.

# ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో ముందుంచుతాం

- **వ్యూహాత్మక ప్రణాళికతో అడుగులు వేస్తున్నాం**
- **ఒక్క రోజులోనే 55 స్కూళ్లకు రూ.11,000 కోట్లు మంజూరు**
- **రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే కుదుటపడుతోంది**
- **పంటలకు నీటి కొరత రాకుండా చూడాలి**
- **జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**విశాలభారతి, ఖమ్మం** ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకుపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు బంజారాహిల్స్ లోని మంత్రుల నివాస సముదాయంలో ఖమ్మం జల్లా సమగ్రాభివృద్ధిపై జిల్లా ఇంచార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రేణుకాచౌదరి, పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డితో పాటు జిల్లా ఎమ్మెల్యేలంతా హాజరయ్యారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై చర్చించడంతో పాటు.. వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను కులంకుషంగా చర్చించినట్లు తెలిపారు. అంతేకాదు, వేసవి కాలం ప్రారంభం కావడం వరికోతల సీజన్న దుస్తుండటంతో.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన అన్నారు. సుమారు 3 గంటల పాటు జరిగిన సుదీర్ఘ సమీక్షలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలబెట్టేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించినట్టు ఆయన చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు, రాహుల్ గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు నిన్న ఒక్కరోజు 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించేందుకు 11,000 కోట్ల రూపాయాలను మంజూరీ చేయడం పట్ల ఆయన హర్షంవ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నప్పటికి నిరుపేదలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన ఎజెండాగా 11 వేల కోట్ల రూపాయలను కేటాయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనే 3 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మించేందుకు 600 కోట్ల రూపాయలను కేటాయించామని.. మొత్తంగా 58 పాఠశాలలకు 11,600 కోట్ల రూపాయలను కేటాయించడం విద్యకు ప్రజాప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన అన్నారు.

**కోళ్ల ఫామ్‌లు నడిపిన బీఆర్ఎస్..**

గత ప్రభుత్వ హాయంలో రెసిడెన్షియల్ స్కూల్స్ లో కోళ్ల ఫామ్స్ నడిపించి నిరుపేదలను అవమానించారని, కానీ తాము అంతర్జాతీయ స్థాయి పాఠశాలలు నిర్మించి విద్యలో అసమానతలు లేకుండా చేస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు. మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం.. నిరుపేదలకు నాణ్యమైన విద్యా, వైద్యం అందిచడమేనని అందుకోసమే ఒకవైపు హైదరాబాద్ చుట్టూ టిమ్స్ హాస్పిటల్స్, నిమ్స్ హాస్పిటల్ నూతన భవనం, వరంగల్ లో సూపర్ మల్టీ హాస్పిటల్ ను నిర్మిస్తున్నామని.. ఇప్పుడు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ను నిర్మిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం అల్వాల్, సనత్ నగర్ టిమ్స్ హాస్పిటల్స్, వచ్చే యేడాది వరంగల్ సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఎల్.బి నగర్ టిమ్స్ హాస్పిటల్ ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని ఆయన ప్రకటించారు

# టన్నెల్ నుంచి మృతదేహం వెలికితీత

తరువాయి భాగం

గుర్తించారు. సొరంగం వద్ద సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌లో మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభించిన దగ్గరలోనే మరో మూడు మృతదేహాలు ఉన్నట్టు గుర్తించిన రెస్క్యూ బృందాలు వాటిని కూడా వెలికి తీసేందుకు సహాయ చర్యలు కొనసాగిస్తున్నాయి. గుర్‌ప్రీత్‌సింగ్ స్వస్థలం పంజాబ్‌లోని తరణ్ జిల్లా చీమకలాన్. ఆయన రాబిన్స్ ఇండియా కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు.

మృతదేహానికి నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి, ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించగా, వారు పంజాబ్‌కు బయలుదేరి వెళ్లారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనలో 16 రోజుల నిరీక్షణ తర్వాత ఒక కార్మికుడి మృతదేహం లభించడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. పంజాబ్‌కు చెందిన కార్మికుడు గురుప్రీత్ సింగ్ మృతికి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేశారు. రేవంత్‌రెడ్డి వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం వల్లే ఈ ఘోరం జరిగిందని, మృతుడి కుటుంబానికి చెరో రూ.50 లక్షల చెప్పున రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మరోవైపు మృతిచెందిన టీబీఎం ఆపరేటర్ గుర్‌ప్రీత్‌సింగ్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల పరిహారాన్ని ప్రకటించారు. గుర్‌ప్రీత్‌సింగ్ మృతికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల పరిహారాన్ని బాధిత కుటుంబానికి అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బదావత్ తెలిపారు.

**సిబ్బంది సాహసం వల్లే : మంత్రి జూపల్లి**

ఎస్ఎల్‌బీసీలో జరిగిన ప్రమాదాన్ని ప్రభుత్వం సవాలుగా తీసుకుందని ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం అచ్చంపేట పట్టణంలోని అంబేద్కర్ ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఎనిమిది మందిని రక్షించేందుకు 11 సహాయక బృందాలతో ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. 16 రోజులుగా టీబీఎం యంత్రం భాగాలు, బురదను తొలగించుకుంటూ ముందుకెళ్లడం సాహసంగా మారిందన్నారు. శనివారం రాత్రి ఒక వ్యక్తి శరీర భాగాలు గుర్తించి ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని వెలికితీసినట్లు పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రితో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. అనంతరం సొంత గ్రామానికి తరలించే బాధ్యత ప్రభుత్వమే తీసుకుంటుందని పేర్కొన్నారు.














# చక్ దే ఇండియా



**విశాలభారతి, స్పోర్ట్స్ బ్యూరో:**
ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమిండియా నిలిచింది. దుబాయ్ వేదికగా న్యూజిలాండ్ తో జరిగిన ఫైనల్లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కివీస్ పోటీ ఇచ్చినా భారత్ విజయాన్ని మాత్రం ఆపలేకపోయింది. ఇండియాకు ఇది మూడో ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్. అంతకముందు 2013 లో ధోనీ కెప్టెన్సీలో ఛాంపియన్స్ ట్రోఫీ టైటిల్ గెలిచింది.

2002లో గంగూలీ కెప్టెన్సీలో శ్రీలంకతో పాటు సంయుక్త విజేతగా నిలిచింది. ఈ మెగా ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 251 పరుగుల మోస్తరు స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసి గెలిచింది. భారత విజయంలో రోహిత్ శర్మ (76: 83 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో కీలక పాత్ర పోషించాడు. 48 పరుగులు చేసి అయ్యర్ రాణించాడు.

ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఇండియాకు అదిరిపోయే ఆరంభం లభించింది. కివీస్ బౌలర్లకు చుక్కలు చూపిస్తూ రోహిత్ శర్మ 41 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో భారత్ పవర్ ప్లే లో వికెట్ నష్టపోకుండా 64 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా భారత్ నిలకడగా ఆడడంతో భారత విజయం నల్లేరు మీద నడకే అనుకున్నారు. అయితే కివీస్ స్పిన్నర్లు విజృంభించడంతో 17 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోయింది. గిల్ (31), రోహిత్ (76),కోహ్లీ (1) ఔటయ్యారు. ఈ దశలో ఒత్తిడిని అధిగమిస్తూ అక్షర్ పటేల్ (29), శ్రేయాస్ అయ్యర్ (48) అద్భుతంగా ఆడారు. కీలక భాగస్వామ్యాన్ని నిర్మించి జట్టును విజయానికి దగ్గరకు తీసుకెళ్లారు. వీరిద్దరూ వెంటనే ఔటైనా రాహుల్ (34) హార్దిక్ పాండ్య (18) మ్యాచ్ ను గెలిపించారు. చివర్లో జడేజా (9) ఫోర్ తో విన్నింగ్స్ రన్స్ కొట్టాడు.

అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ డారిల్ మిచెల్, బ్రేస్ వెల్ అద్భుతంగా రాణించడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 251 పరుగుల మోస్తరు స్కోర్ చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ డారిల్ మిచెల్ 101 బంతుల్లో 63 పరుగులు చేసి టాప్ స్కోరర్ గా నిలిచాడు. బ్రేస్ వెల్ 51 పరుగులు చేసి చివర్లో మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ తలో రెండు వికెట్లు తీసుకున్నారు. జడేజా, షమీలకు ఒక వికెట్ దక్కింది.





# ఎమ్మెల్సీ అభ్యర్థులు ఫైనల్

తరువాయి భాగం

నలుగురు ఎమ్మెల్సీలు కాబోతుండడం. అధికార కాంగ్రెస్ ప్రకటించిన ముగ్గురు అభ్యర్థుల్లో ఇద్దరు ఉమ్మడి నల్ల గొండ జిల్లాకు అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్ కాగా, మిత్ర పక్ష సీపీఐ అభ్యర్థిత్వం సైతం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యానికి దక్కింది. వీరితోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యర్థిత్వం దక్కించుకున్న దాసోజు శ్రవణ్‌కుమార్ సైతం నల్ల గొండ బిడ్డే కావడం విశేషం. మొత్తంగా ఏక సమయంలో వేర్వేరు వేదికల ద్వా రా నల్లగొండ జిల్లాకు చెందిన నలుగురు పెద్దల సభకు వెళ్లేందుకు అవకాశం దక్కించుకోవడం ద్వారా జిల్లా ప్రతిష్ట ఇనుమడింపజేశారనే చర్చ సాగుతోంది. నేడు వీరంతా నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

**కాంగ్రెస్ సామాజిక న్యాయం**

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో విధేయతకు, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎమ్మెల్యేలు ఎన్నుకునే కోటాలో జరిగే ఈ ఎన్నికలకు సుదీర్ఘకాలంగా పార్టీని నమ్ముకుని ఉన్న అద్దంకి దయాకర్, కెతావత్ శంకర్‌నాయక్‌లకు టికెట్లను ఖరారు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన విజయశాంతికి కూడా అవకాశం ఇచ్చింది. ఈ ముగ్గురి పేర్లను కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం సాయంత్రం ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదంతో ఈ పేర్లను ప్రకటించినట్లు ఆయన వివరించారు. మొత్తం 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి కాంగ్రెస్‌కు 4, భారాసకు ఒకటి దక్కనున్నాయి. తమకు వచ్చే నాలుగులో ఒక సీటును పొత్తు ధర్మం ప్రకారం సీపీఐకి కేటాయించినట్లు కేసీ వేణుగోపాల్ తెలిపారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుని కొత్తగూడెం సీటును కేటాయించింది. అప్పుడు తమకు రెండు అసెంబ్లీ సీట్లు ఇవ్వాలని సీపీఐ పట్టుబట్టింది. కానీ కొత్తగూడెం ఒకటే ఇచ్చి భవిష్యత్తులో ఎమ్మెల్సీ సీటు ఇస్తామని కాంగ్రెస్ సీపీఐకి హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే తాజాగా సీటును కేటాయించింది. ఎప్పుడూ ఒక్కటైనా ఓసీలకు ఇవ్వడం కాంగ్రెస్‌లో ఆనవాయితీ. పైగా ఈసారి ఆ వర్గం నుంచి పలువురు సీనియర్, జూనియర్ నేతలు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసినా సామాజిక న్యాయానికే పార్టీ పెద్దపీట వేసింది.

**బీఆర్ఎస్ఎమ్మెల్సీ అభ్యర్థిగా దాసోజు**

ఎమ్మెల్యేల కోటాలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో భారాస ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ దాసోజు శ్రవణ్ పేరును ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. నామినేషన్ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించాలని పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఆయన ఆదేశించారు. సోమవారం ఉదయం 11 గంటలకు శ్రవణ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. శాసనసభలో ఆ పార్టీ తరఫున ఎన్నికైన ఎమ్మెల్యేలు 38 మంది ఉండగా.. వారిలో 10 మంది కాంగ్రెస్‌లో చేరారు. కానీ అధికారికంగా భారాస ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నారు. ఒక ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికకు 21 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఈ పరిస్థితుల్లో దాసోజు శ్రవణ్ ఎన్నిక లాంఛనం కానుంది. రెండో అభ్యర్థిని కూడా రంగంలోకి దించాలని పార్టీలో చర్చ జరిగినా.. ఒక్కరినే రంగంలో ఉంచాలని కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. దాసోజు శ్రవణ్‌ను భారాస ప్రభుత్వ హయాంలో 2023 జులై 31న గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా అప్పటి ప్రభుత్వం సిఫార్సు చేసింది. కానీ సాంకేతిక కారణాలతో అప్పటి గవర్నర్ తమిళిసై తిరస్కరించారు. తాజాగా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితర పేర్లు పరిశీలనలోకి వచ్చినా.. శ్రవణ్ వైపే కేసీఆర్ మొగ్గుచూపారు.

**సీపీఐ అభ్యర్థిగా నెల్లికంటి సత్యం**

సీపీఐ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నెల్లికంటి సత్యంను ఆ పార్టీ ప్రకటించింది. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించిన తర్వాత ఆయన పేరును ఆదివారం రాత్రి రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. సత్యం సోమవారం ఉదయం 10 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఈయన ప్రస్తుతం సీపీఐ నల్గొండ జిల్లా కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు. సత్యం పేరును ఆ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి పల్లా వెంకట్‌రెడ్డి ప్రతిపాదించినట్లు సమాచారం. సీనియర్‌నేత చాడ వెంకట్‌రెడ్డి పేరునూ ప్రతిపాదించగా.. తాను పోటీలో ఉండటం లేదని ఆయన ప్రకటించారు. దీంతో సత్యం పేరును సీపీఐ రాష్ట్ర కార్యవర్గం ఖరారు చేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మునుగోడు స్థానంలో పోటీ చేయాల్సిందేనని సీపీఐ నల్గొండ జిల్లా నాయకత్వం పట్టుబట్టింది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ కొత్తగూడెం స్థానాన్ని కేటాయించిందని వివరిస్తూ భవిష్యత్తులో వచ్చే ఎమ్మెల్సీ స్థానాన్ని ఇస్తామని నెల్లికంటి సత్యంకు పార్టీ నాయకులు హామీ ఇచ్చారు. ఆ మేరకు తాజాగా ఖరారు చేశారు.

**ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవమే..**

ఎమ్మెల్యేల కోటాలో జరగనున్న 5 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీ ముగ్గురు అభ్యర్థులను పోటీలో నిలపగా.. సీపీఐ ఒకరిని, భారాస ఒకరిని బరిలోకి దించాయి. దీంతో ఐదుగురి ఎన్నిక లాంఛనమే కానుంది. ఈనెల 11న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. అభ్యర్థిత్వ ఉపసంహరణకు 13న మధ్యాహ్నం వరకూ గడువు ఉంటుంది. ఐదు స్థానాలకు ఐదుగురి కంటే ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉంటే.. ఈనెల 20న ఎన్నిక నిర్వహిస్తారు. అయితే బీఆర్ఎస్ కూడా ఒక అభ్యర్థినే ప్రకటించడంతో.. పోటీలో ఐదుగురే మిగిలారు. దీంతో ఎన్నిక జరిగే అవకాశాలు లేనట్లే. 13న ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత.. అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు శాసనసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు.




## అడవులను ఖనిజ సంపదను కాపాడాలి

- ఆదివాసీల హనాన్నని ఆపాలి

**సూర్యాపేట, విశాలభారతి:** ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివాసుల హక్కుల పోరాటాల సంఘీభావ సదస్సు న్యాయవాది తల్లమల్ల హసేన్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథులుగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ నారాయణ రావు, సిపిఎం పార్టీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, సిపిఐ ఎం న్యూ డెమోక్రసీ సూర్యాపేట జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ హాజరై మాట్లాడుతూ అడవులను అడవులలో జీవించే ఆదివాసులను హననం కాకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రజలందరిపై ఉన్నదని కోరినారు. గత రెండున్నర శతాబ్దాలుగా ఆనాటి కాంగ్రెస్ పార్టీ నేటి బిజెపి పార్టీ ఆదివాసుల కనీస హక్కులను జీవించే హక్కును కాలరాస్తూ కార్పొరేటు హిందుత్వ పాసింజర్ తో పరిపాలిస్తున్నట్టు, అడవులలోని ఖనిజ సంపదను దేశీయ విదేశీయ కార్పొరేట్లకు దోచిపెట్టడాన్ని సల్వాన్జుడు ఆపరేషన్ గ్రీన్ హంట్ మొదటి దశ, రెండవ దశ 2005 నుండి 2011 వరకు ఆపరేషన్ సమాధానం ఆపరేషన్ ప్రహార్ నుండి 2017 వరకు అటు తర్వాత ఆపరేషన్ కగార్ ప్రారంభించారని తెలిపారు. మతం పేరిట నక్సలైట్ల పేరిట ఆదివాసులను ఎన్కౌంటర్ ద్వారా హత్య చేస్తూ ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ జిల్లా కన్వీనర్స్ భద్రయ్య, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్ రెడ్డి, నారబోయిన వెంకట్ యాదవ్,సిపిఐ ఎంఎల్ మాస్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి పేర్ల నాగయ్య, సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగయ్య, డిటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొచ్చర్ల వేణు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టి పల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
10.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## గర్వంతో ఉప్పొంగిపోయా..

**టీమిండియా విజయంపై మహేష్ బాబు ఎమోషనల్ ట్వీట్**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 విజేతగా భారత్ నిలిచింది. దుబాయ్ వేదికగా ఆదివారం (మార్చి 9) జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌ను మట్టి కరిపించి టీమిండియా ఘన విజయం సాధించింది. ప్రతిష్టాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు టీమిండియాకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే సూపర్ స్టార్ మహేష్ బాబు టీమిండియాకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రిన్స్ ఎమోషనల్ ట్వీట్ చేశారు. "మ్యాచ్ చూస్తూ గర్వంతో ఉప్పొంగిపోయా. ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్నందుకు టీమిండియాకు భారీ అభినందనలు.



## ఘనంగా లయోలా స్కూల్ 35వ వార్షికోత్సవ వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన ఈటెల రాజేందర్

**పెద్ద అంబర్పేట్, విశాలభారతి:** ఆదివారం సాయంత్రం కుంట్లూరు లోని లయోలా మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 35వ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం సభ్యులు ఈటల రాజేందర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లయోలా హై స్కూల్ చైర్మన్ కొత్త అభినధన్ గౌడ్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా లయోలా విద్యాసంస్థను నడిపించడం జరుగుతుందని తమ పాఠశాల యందు ఎంతో



మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలలో ఉంచాలని ఉద్దేశంతో కుంట్లూరు ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఈ విద్యాసంస్థను ఇక్కడ నిర్మించడం నాకు చాలా ఆనందాన్ని కలిగించిందని అన్నారు, మా విద్యాసంస్థను ఇంతగా ఆరాధిస్తున్నటువంటి ఈ ప్రాంత ప్రజలకు స్థానికంగా ఉన్నటువంటి ప్రజా ప్రతినిధులకు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కొత్త రవీందర్ గౌడ్,ప్రిన్సిపల్ బద్దం శైలజ, పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్త పల్లి జైపాల్ రెడ్డి, మున్సిపాలిటీ ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి, హయత్ నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి పాల్గొన్నారు.




## రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన

- రక్తదానం ప్రాణదానంతో సమానం
- యువత ముందుకు రావడం శుభ పరిణామం

**భీమదేవరపల్లి, విశాలభారతి:** రక్తదానం ప్రాణదానంతో సమానమని యూత్ కాంగ్రెస్ నాయకులు గజ్జల రమేష్, జక్కుల అనిల్ యాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని ముల్కనూర్ ప్రజా గ్రంధాలయం భవనంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎన్ఎస్ఎస్, రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ప్రారంభించారు. రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వారికి సహాయం చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు యూత్ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మండలలోని యువత సామాజిక కార్యక్రమాల్లో ముందు ఉండడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులు రక్తదానం చేశారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేయగా వారికి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ స్టాప్ డాక్టర్ కిషన్ రావు, శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ సౌమ్య, కొత్తకొండ దేవస్థాన మాజీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, గనబోయిన శ్రీకాంత్, గజ్జల రమేష్, బొల్లంపల్లి రమేష్, అనిల్, తాళ్ల అరవింద్, వల్లపు మహేందర్ ప్రశాంత్, నితిన్ పాల్గొన్నారు.

## అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**సూర్యాపేట, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం నుండి అధ్యయన బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ చైర్మన్ గూకంటి రాజబాబు రెడ్డి తెలిపారు. ప్రాచీన ఆలయాలకు పిల్లలమర్రి ప్రసిద్ధి గాంచిందని కాకతీయుల కాలంలో నిర్మించిన మహిమాన్విత ఆలయాలు భక్తులకు ఇక్కడ దర్శనం ఇస్తాయని అన్నారు.121వ బ్రహ్మోత్సవాలు సందర్భంగా శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం ముస్తాబు అయిందని, దూర ప్రాంతాల నుండి జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మరింగంటి వరదా చార్యులు యాగ్నికమున ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించటం జరు



గుతాయన్నారు. ఈ ఐదు రోజులు పాటు జరిగేటువంటి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఉమ్మెంతల హరిప్రసాద్,ఉమ్మెంతల ఆహ్లాద రావు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ మంగపండ్ల మల్లికార్జున్, కమిటీ సభ్యులు కంధకట్ల రాంబాబు, కుమ్మరికుంట్ల జానయ్య, గంపల శంకర్,సైధమ్మ మల్లయ్య, బంగారి కృష్ణయ్య,కోనేటి కృష్ణ, చెరుకుపల్లి రాజు, అంకం భిక్షం పాల్గొన్నారు.




## సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో లేబర్ కార్డులను పంపిణీ

- తమ హక్కుల పోరాటం కోసం కృషి చేయాలని కోరిన కార్మికులు
- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాది రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ రావి నారాయణరెడ్డి కాలనీ 2 కార్యాలయంలో లేబర్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో భాగంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాది రెడ్డి చేతుల మీదుగా కార్మిక సోదరులకు లేబర్ కార్డులను పంపిణీ చేశారు. కార్మికుల కష్టసుఖాలలో తాను ఎల్లవేళలా తోడుంటానని హామీ ఇవ్వడం జరిగింది, తమ హక్కుల సాధన కోసం లేబర్ కార్డులను పంపిణీ చేయడం చాన సంతోషమని కార్డులు తీసుకుంటున్న కార్మికులు, తాపీ మేస్త్రీలు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ ముత్యాల యాదిరెడ్డి ,సిపిఐ పార్టీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సిపిఐ పార్టీ మాజీ కౌన్సిలర్ అజ్మేరా హరి సింగ్ నాయక్,బి ఓ సి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు దాసరి ప్రసాద్,ఆర్ ఎన్ ఆర్ కాలనీ2 ఇన్చార్జి చిర్రా శేఖర్, ధూపం నిరంజన్, కాసిం, వెంకటేష్, మంగళపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న నగదు తిరిగి అప్పగించిన పోలీసులు

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** ఆటోలో పోగొట్టుకున్న నగదును తిరిగి అప్పగించమంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు హయత్ నగర్ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో కనుగొని ఆదివారం తిరిగి బాధితులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే మహబూబ్ నగర్ కు చెందిన వీర సత్య మల్లేష్ తన భార్య శ్రీ సూక్ష్మ ఇద్దరూ ఆంధ్ర ప్రదేశ్ నుండి హయత్ నగర్ లో బస్సు దిగి లోకల్ ఆటో సహాయంతో సూర్య నగర్ లో గల తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. కాసేపటి తరువాత చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మర్చిపోయామని తెలిసి వెంటనే ఆటో గురించి వెతకగా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో బాధితులు హయత్ నగర్ పోలీసులను



ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హయత్ నగర్ క్రైమ్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి విలువైన ఆభరణాలు, 14 వేల రూపాయల నగదు తిరిగి బాధితులకు అప్పగించామని సీఐ నాగరాజుగౌడ్ అడ్మిన్ ఎస్సై కె.వెంకట్ రెడ్డి తెలిపారు.



## కళ్యాణ మహోత్సవం వేడుకల్లో పాల్గొన్న దండెం రాంరెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** అబ్దుల్లాపూర్ మెట్ మండలం, బలిజగూడ గ్రామంలో శ్రీశ్రీశ్రీ వీరభద్ర స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు శనివారం రాత్రి శ్రీ శ్రీ శ్రీ వీరభద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేడుకలో పాల్గొన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు దండెం రాంరెడ్డి స్వామి వారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్ర వీరాస్వామి, ఉప్పు వెంకటేష్, మాజీ జడ్పీటీసీ బింగి దేవదాస్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి, సతీష్ కుమార్, రాజేష్, బుర్ర జ్ఞానేశ్వర్, ఉప్పు సురేష్, భారత్, సందీప్, సాయి, పవన్ గౌడ్ మొగుళ్ళ రాంరెడ్డి, ఉసిగారి మధు, బుర్ర మనీష్ గౌడ్ మరియు తదితర నాయకులు , గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



## హయత్ నగర్ డివిజన్ వార్డులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

- హయత్ నగర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం మా బాధ్యత
- సుప్రజా హాస్పిటల్ వారి సౌజన్యాలతో నిర్వహన
- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో సుప్రజా హాస్పిటల్ వారు నేడు హయత్ నగర్ వార్డు కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఉచిత డాక్టర్స్ కన్సల్టేషన్, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, ఉచిత మందులు, ఉచిత డయాగ్నోస్టిక్ సేవలు, ఈకో, ఈసీజీ , జీ ఆర్ బీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ హయత్ నగర్ డివిజన్ ప్రజల ఆరోగ్యం మా బాధ్యత అని, దాదాపు 200 మంది హయత్ నగర్ డివిజన్ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం జరిగిందని, ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు సుప్రజా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ అజయ్ కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు గంగాని శ్రీను , జీవన్ అన్న మిత్ర బృందం సభ్యులు పాండల శ్రీధర్ , శ్రీకార్ణ , డివిజన్ ప్రధాన కార్యదర్శి సంఘీ అశోక్ , నాయకులు వస్పరి వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## హ్యాపీ బర్త్ డే సింధు..

- కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన హరీష్ రావు
- కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి జన్మదిన వేడుకలు

**పటాన్ చెరు,విశాలభారతి**



భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆదివారం తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. కార్పొరేటర్ సింధు తన పుట్టిన రోజు సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు కార్పొరేటర్ సింధుకు పూల మొక్క అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తమ ప్రియతమ నేత జన్మదినం సందర్భంగా కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డికు బీఆర్ఎస్ శ్రేణులు, డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు, మహిళా సంఘం నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు కేక్ కట్ చేసి తన పుట్టినరోజు వేడుకలను కార్యకర్తల మధ్య ఆనందోత్సహాలతో జరుపుకున్నారు

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సోమవారం,
10.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మరిపెడ, విశాలభారతి:**

మరిపెడ మండలం మరిపెడ గ్రామంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ నందు ఆదివారం పదవ తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. 20142015విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన సుమారు 50 మంది విద్యార్థులు ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారికి విద్య బోధించిన గురువులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.



# టీఎస్ జెఏ సూర్యపేట జిల్లా కోశాధికారిగా లంకపల్లి రమేష్

**గరిడేపలల్లి, విశాలభారతి:**

తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ సూర్యాపేట జిల్లా కోశాధికారిగా పొనుగోడు గ్రామానికి చెందిన లంకపల్లి రమేష్ ఎంపిక కావడం పట్ల పొనుగోడు అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు నందిపాటి నరేష్ హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉంటూ అనేక విషయాలపై మీడియా రంగంలో ముందుకు పోవడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా పూలమాల తో చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ కమిటీ ఉపాధ్యక్షులు చిటికెల కిరణ్, ప్రధాన కార్యదర్శి ఒగ్గు మహేష్, కదురు మహేష్, చిలకా పిచ్చయ్య, నందిపాటి మల్లయ్య, బచ్చలకూరి జానకి రాములు, అశోక్ రవి ప్రశాంత్ రాంబాబు అంబేద్కర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.



# ఏజెన్సీ ఎస్సీ కులాలకు స్థానిక రిజర్వేషన్ అమలు చేయాలి

**మణుగూరు, విశాలభారతి:**

ఈనెల 12 నుండి తెలంగాణ రాష్ట్ర వేసవి అసెంబ్లీ సమావేశాల్లో ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాల అభివృద్ధిపై ప్రస్తావించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కలు ప్రస్తావించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం నాడు షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కొత్తగూడెం సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల సమస్యలపై చర్చించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాలకు స్థానిక రిజర్వేషన్ జెడ్పీటీసీ,ఎంపీటీసీ వార్డు సభ్యుల రిజర్వేషన్ అమలు చేయాలని, ఎస్సీ రైతుల సాగు భూములకు,పోడు భూములకు ఆంక్షలు లేకుండా హక్కు పత్రాలు ఇవ్వాలని, స్థానిక ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాలను ఎస్సీ కులాలుగా గుర్తించి అభివృద్ధి చేయాలని రిలే నిరాహార దీక్ష ఈనెల 17, 18 తేదీలలో తలపెట్టి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చౌకులో ఏజెన్సీ ప్రాంత ఎస్సి కులాల ధర్మ పోరాట దీక్ష ను ఎస్సీ కులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులు కొమ్ము శ్రీరామ్, కొత్తగూడెం మాజీ జెడ్పిటిసి పరంజ్యోతి,దళిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నడ్డి రవికుమార్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు చదలవాడ సూరి పాల్గొన్నారు.

# ఉమెన్ ఐకాన్ 2025 అవార్డు అందుకున్న గాయని పూజారి జ్యోతి

**మణుగూరు, విశాలభారతి:**




మణుగూరుకు చెందిన గాయని పూజారి జ్యోతి, ఆదివారం నాడు హనుమకొండ ప్రెస్ క్లబ్ మీటింగ్ హాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా విస్డం చారిటబుల్ ట్రస్ట్ వారు ఉమెన్ ఐకాన్ అవార్డు 2025 ను పూజారి జ్యోతి కి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పూజారి జ్యోతి మాట్లాడుతూ ఈ అవార్డు అందుకోవటం చాలా సంతోషంగా ఉందని ఈ అవార్డుతో మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. పూజారి జ్యోతి కి అవార్డు రావడం, మణుగూరు ఖ్యాతి ని రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడం సంతోషంగా ఉందని, తోటి గాయని గాయకులు, మణుగూరు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కొండాపూర్ లో కళాకారుల కమిటీ ఎన్నిక

**చిగురుమామిడి, విశాలభారతి:**



మండలంలో శ్రీరామోజు రాజ్ కుమార్ తెలంగాణ రంగస్థల సాంస్కృతిక కళాకారుల అసోసియేషన్ చిగురుమామిడి మండల అధ్యక్షుని ఆదేశాల మేరకు మండల కోశాధికారి బింగి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కొండాపూర్ లో కళాకారుల గ్రామ కమిటీ ఎన్నిక చేయడం జరిగినది. ఇందులో గౌరవ అధ్యక్షులుగా వంగర మల్లేశం, అధ్యక్షులుగా బింగి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా వేమునూరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా తౌటు రాజారామ్,కోశాధికారిగా వేమునూరి సంపత్, సహాయ కార్యదర్శిగా చీకుట్ల రాజు, ,గౌరవ సలాదారుడిగా వేమునూరి భాస్కర్, సభ్యులుగా వంగర చంద్రమౌళి, పెద్దపెల్లి జనార్ధన్, తౌటు గంగారం, వేమునూరి కేదారి, బింగి వెంకటేష్, సున్నం ప్రసాద్, బూర్ల కుమార్, పైడిపల్లి సాయి కుమార్, బైరి శివగంగ యాదవ్ లు ఉన్నారు.

# పిఆర్సి రిపోర్ట్ తెప్పించుకొని వెంటనే అమలు పరచాలి

- పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి
- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు సయ్యద్ సాబేర్ అలీ, శ్రీనివాస రాథోడ్

**పటాన్ చెరు,విశాల భారతి**




స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ సంగారెడ్డి జిల్లా శాఖ ప్రధమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్ అలీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఎస్టియు ధ్యేయమని, 78 ఏండ్లుగా ఉపాధ్యాయుల పక్షపాతిగా సంఘం కొనసాగుతుందని అన్నారు. సంవత్సరాల తరబడి వివిధ రకాల ఆర్థికపరమైన బిల్లులను పెండింగ్ లో ఉంచి ఆర్థిక మనోవేదన గురి చేస్తున్నారని, వెంటనే వాటిని అన్ని రకాల బిల్లులను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. వీటిలో తమ అవసరాల కోసం నెల జీతం నుంచి దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పార్ట్ ఫైనల్స్ ఫైనల్పేమెంట్లను మొండి బకాయిలుగా మార్చడం, అనారోగ్య కారణంతో హాస్పిటల్ పాలై అప్పులు చేసి హాస్పటల్లో చూపించుకుని ఆ డబ్బును మెడికల్ రెయిన్బర్స్మెంట్ కోసం పెట్టుకున్న బిల్లులైతే సంవత్సరాలు తరబడి పెండింగ్ అని పెట్టడం, తమ సెలవులను వాడకుండా దాచుకొని కుటుంబ అవసరాలకి సరెండర్ చేసుకుంటే ఆ అమౌంట్ సైతం ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు.

గతంలో ఎన్నడు లేని విధంగా ఐదు డిఏలు పెండింగ్లో పెట్టారని వాపోయారు.

పెరిగిన ధరల కనుగుణంగా రావలసిన డియర్ నెస్ అలవెన్స్ ను పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. వెంటనే పెండింగ్ డీఏ లను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్సి కాలం కూడా పూర్తి అయి దాదాపు 22 నెలలు కావస్తున్నందున వెంటనే పిఆర్సి నివేదిక తెప్పించుకుని అమలు చేయాలని కోరారు.

ఈ కార్యవర్గ సమావేశంలో ముఖ్యమైన తీర్మానాలు..

1.కేంద్ర ప్రభుత్వం మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను వెంటనే ఓపిఎస్ పరిధిలోకి మార్చాలి,

2. అన్ని రకాల పర్యవేక్షణ పోస్టులు డిప్యూటీ ఈ వోలు, డైరెక్టు లెక్చరర్స్, జేఎల్, రెగ్యులర్ ఎంఈఓ భర్తీ చేయాలి .

3. సిపిఎస్ మొత్తాన్ని రద్దు చేసి ఓపిఎస్ అమలు పరచాలి.

4. నెలవారి పదోన్నతులను పునరుద్ధరించాలి.

5. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు పై చదువులకు అనుమతించే జీవో 342 నెక్స్ట్ క్యాడర్ అనే పరిమితి లేకుండా అమలు పరచాలి.

6. ఉర్దూ మీడియంలో బ్యాక్ లాగ్ అయిన పోస్టులను వెంటనే జనరల్ క్యాటగిరీగా ఉర్దూ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి.

కార్యక్రమాల నివేదికను, తీర్మానాల ప్రతిని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రాథోడ్ కార్యవర్గం ముందు ఉంచడం జరిగింది.

కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్, జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జీవన్ రాథోడ్, అధ్యక్షులు ఖయ్యూం, సంగారెడ్డి మండలం అధ్యక్షులు అంజద్ అలీ, పటాన్ చెరు మండల అధ్యక్షులు సుందర్ రావు, రామచంద్రపురం మండల అధ్యక్షులు ప్రకాష్, నిజాంపేట మండల అధ్యక్షులు విజయకుమార్, జహీరాబాద్ అధ్యక్షులు రియాజ్ అహ్మద్ ఖాన్, జిల్లా నాయకులు అబ్దుల్ సమీ, ప్రతాపరెడ్డి, ఎన్ కే శాలి, అబ్దుల్ సమద్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**శాలిగౌరారం, విశాలభారతి:**

ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన లయన్స్ క్లబ్ సేవలు నేడు గ్రామీణా ప్రాంతాల్లో విస్తరించి వైద్య సేవలు అందించడంలో ఎంతో కృషి చేస్తున్నాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం శాలిగౌరారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సహకారం తో శాలిగౌరారం గ్రామ పంచాయితీ వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి కంటి వైద్య శిబిరం ను ప్రారంభించి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు వైద్య సేవలే పరిమితం కాకుండా ప్రజలకు, విద్యార్థులకు, మహిళలకు సంబధించిన సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. వివిధ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నరన్నారు. లయన్స్ క్లబ్ వారు చేస్తున్న సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శాలిగౌరారం ప్రాజెక్టు అభివృద్ధికి, రోడ్ల మరమ్మత్తుల కు, అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కలిపించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ వైద్య శిబిరం లో దాదాపు 300 మందికి కంటి పరీక్షలు చేసి మందులు, అద్దాలు పంపిణి చేశారు. 50 మందికి ఆపరేషన్ చేయడానికి గుర్తించి మొదటి విడతగా 20 మందిని ఆపరేషన్ చేయడానికి సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రికి ప్రత్యేక బస్సు లో తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి ఛైర్మెన్,సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే దోసపాటి గోపాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వుప్పల రాజేంద్రప్రసాద్,క్లబ్ రీజన్ ఛైర్మెన్ గుడిపూడి వెంకటేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.



# దేవాదుల నీరు అందక బోరుమంటున్న రైతన్నలు

**ఎల్కతుర్తి, విశాలభారతి:**

మండలంలోని పలు గ్రామాల రైతుల ఆవేదన దేవాదుల కాలువ నీళ్లు అందక ఎండిపోయిన వరి మొక్కజొన్న పంటలు మండలంలోని గోపాల్ పురం గ్రామంలో కర్ర రాజు వరి 1.00 ఎకరం రుద్రారపు బాబు మొక్కజొన్న 2.20 జూపాక ఉన్ రవీందర్ 2.00 ఎకరాలు ఎండిపోయిన పంటలను పరిశీలించిన హనుమకొండ జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఊట్కూరి రాములు ఆరుగాలం శ్రమించి పెట్టుబడి పెట్టి ఒక ఎకరానికి దాదాపు 30 వెయ్యిలు చొప్పున పెట్టి తీరా నోట్లకి వచ్చేసరికి వరి మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఎండలకు బావి బోర్లలో నీరు అడుగంటి పోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవాదుల కాలువ క్రింద ఉన్న గ్రామాలలో నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పాలలో పంటలు ఎండిపోయిన రైతులకు సంబంధించిన వ్యవసాయ అధికారుల ద్వారా ఆయా మండలాల్లో గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రతి ఒక్క రైతుకు తగు న్యాయం చేయాలని అలాగే పండించిన పంటలకు పత్తి మిర్చి పసుపు పంటలకు గిట్టుబాటు ధర కల్పించలని ప్రభుత్వాన్ని కోరినాడు.





# శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతరలో పాల్గొన్న కాట

**పటాన్ చెరు,విశాలభారతి**

పటాన్చెరు మండలం భానూరు గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ జాతరలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. గ్రామాల్లో జాతరలతో ఆధ్యాత్మిక వాతావరణ నెలకొంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరు భక్తి భావం అలవర్చుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, శ్రీహరి, శివానందం, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సోమవారం,
10.03.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా గోపలి పవన్ కుమార్ ఎన్నిక



ఇబ్రహీంపట్నం,విశాలభారతి:

ఎన్ఎస్‌యుఐ రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా గోపలి పవన్ కుమార్ ఎన్నికయ్యారు. గోపలి పవన్ కుమార్ రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన వ్యక్తి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు. జిల్లాలో, నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. తనపై నమ్మకంతో ఎన్ఎస్‌యుఐ రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా ఎన్నుకున్నందుకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ఎల్లవేళల కృషి చేస్తానని తెలిపారు.



# అడ్డగుట్టలో ఆదం సంతోష్ కుమార్ బస్తి బాట కార్యక్రమం

సికింద్రాబాద్, విశాలభారతి:

సికింద్రాబాద్ నియోజక వర్గం పరిధిలోని అడ్డగుట్ట డివిజన్ కట్టెల మండి, ఇందిరా నగర్ "డి "కాలనీ, ఇందిరా నగర్ "సి" కాలనీ, శేష పహాడ్, ఏరియ లో "బస్తీ బాట " కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమము లో డ్రైనేజ్ సమస్యలు, మంచినీటి సమస్యలు, బోర్ సమస్యలు, ఎలక్ట్రిసిటీ సమస్యలు, రోడ్ల సమస్యలు బస్తీ ప్రజలు తెలిపారు. గత పది సంవత్సరాల నుండి స్థానిక ఎమ్మెల్యే గాని, కార్పొరేటర్ గాని తమ సమస్యలు పట్టించుకోలేదని ప్రజలు చెబుతున్నారు. ఈ సమస్యలు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో ఆదం భరత్ కుమార్,ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్, అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షులు గణేష్ యాదవ్, తార్నాక డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ గౌడ్, బౌద్ధ నగర్ డివిజన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, తార్నాక డివిజన్ అధ్యక్షులు బ్రహ్మాజీ, సీనియర్ నాయకులు ఈసన్న, మైనార్టీ సీనియర్ నాయకుడు షకీల్ ఖాన్, కేకేసి చైర్మన్ గంట రాజు సాగర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దొమ్మాటి శివకుమార్, బోయిన్పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ అమెర్, అబ్దుల్ నిసార్, ఎస్ శ్రీను, రవి, ఎ సంతోష్ యాదవ్, ఆంటోని, వెంకట్ ,రాజా రాం, యాదుల్ల, అడ్డగుట్ట కమిటీ మెంబర్స్ మంద ప్రభాకర్, హరి, రమేష్, టిప్పు, వి. పోచయ్య, నదీమ్, రేవంత్, ఫహాద్, పహాన్, జబ్బర్, నభి, అడ్డగుట్ట కాంగ్రెస్ మహిళా నాయకులు లక్ష్మీ యాదవ్, చంద్రకళ, వరలక్ష్మి, దొమ్మాటి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి కళ్యాణ మహోత్సవం

- **ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు,విశాలభారతి

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల లో శనివారం రాత్రి నిర్వహించిన శ్రీ లక్ష్మీ అనంత పద్మ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల సమక్షంలో వేద మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా జరిగాయి. పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోనే ప్రముఖ ఆలయంగా విరజిల్లుతున్న అనంత పద్మనాభ స్వామి దేవాలయం మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్ పూర్ మాజీ జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, మల్లా రెడ్డి, రవీందర్ రెడ్డి, కొమరయ్య, స్థానిక సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈ నెల 10 న గ్రేట్ తెలంగాణ మిలియన్ మార్చ్ డే

- **భారీగా తరలి రండి**
- **తెలంగాణ జర్నలిస్ట్ ఫ్రంట్**

సికింద్రాబాద్,విశాలభారతి :

తెలంగాణ ఉద్యమానికి కీలక భూమిక అయిన మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకుందాం. 2011 మార్చి 10 న తెలంగాణ ఆకాంక్షను ఎలిగెత్తి చాటిన రోజు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ట్యాంకుబండు కు లాఠీలు, తూటాలను లెక్కచేయకుండా లక్షలాది మంది హైదరాబాదు నగర నడిబడ్డెన ట్యాంక్ బండ్ కు చేరుకొని ఉద్యమ స్ఫూర్తిని నింపిన రోజు. దాదాపు లక్ష మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన మిలియన్ మార్చ్ డే ను గుర్తు చేసుకుందాం రండి. ఈనెల 10 న ఉదయం 10 గం. లకు. హైదరాబాదులోని అమర జ్యోతి నుంచి గన్ పార్క్ వరకు ర్యాలీకి తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ పిలుపునిచ్చింది. కావున జర్నలిస్టులు, మేధావులు, కవులు,కళాకారులు, కార్మికులు,ప్రజా,విద్యార్థి, యువజన,ఉద్యోగ,పార్టీలు పాల్గొని తెలంగాణ ఐక్యతను ఎలుగెత్తి చాటుదాం. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్ బైరాగి,డాక్టర్ వెంకటేశ్వర్లు,మెరుగు శ్రీనివాస్,రాజేంద్ర ప్రసాద్,కూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కర్మలకు పద్మశాలి కమిటీ యువత వితరణ సాయం



పినపాక, విశాలభారతి:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మండలం ఉప్పాక గ్రామంలోని కుంజా పుల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగినది. ఈ విషయం తెలుసుకున్న పద్మశాలి యువజన సంఘం తరఫున 25 కేజీల బియ్యం 2500 నగదు ఇవ్వడం జరిగింది. అనంతరం పద్మశాలి యువత పుల్లయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పడం జరిగింది. కార్యక్రమంలో పద్మశాలి కమిటీ యువత పాల్గొన్నారు.





# శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు,విశాలభారతి;

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల గ్రామంలో శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు కాట శ్రీనివాస్ గౌడ్ కు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఎల్.రవీందర్, శివానందం, శ్రీహరి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా వారసి గూడ గంగపుత్ర సంక్షేమ సంఘం 29వ సర్వసభ్య సమావేశం

సికింద్రాబాద్, విశాలభారతి:

గంగపుత్రులంతా కలిసికట్టుగా ఉంటూ రాజకీయ పరంగా ఎదగాలని పలువురు వ క్తలు పిలుపునిచ్చారు. ఆదివారం వారాసిగూడ గంగపుత్ర సంక్షేమ సంఘం 29వ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం అధ్యక్షుడు చల్లూరి సంజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు. వారసిగూడ జెడ్ యం ఏసి ఫంక్షన్ హాల్ జరిగిన కార్యక్రమం లో ముందుగా దీపారాదన, ప్రార్థన, దివంగత సభ్యులకు నివాళి ,అధ్యక్షుల ఉపన్యాసము,కార్యదర్శి నివేదిక,కోశాధికారి నివేదిక సభ్యుల ఆమెదం,చిట్టీల కార్యదర్శి నివేదిక,ఇంటర్నల్ ఆడిటర్ నివేదక, సభ్యుల సలహాలు, సూచనలు, నూతన ప్రతి పాదనలు, తీర్మానములు చేశారు. అనంతరం 60, 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘ సభ్యులకు సన్మానం చేశారు. అలాగే 10 వ తరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ, ఇంజనీ రింగ్ ఫైనల్ ఇయర్ పాసైన మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు . ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు దేశ బోయిన రఘు, క ర్మకొండ సత్యనారాయణ, కట్కూరి రమేష్, పూస బాలయ్య, పాక మూర్తి, కంటే హరినాథ్ బాబు, పూస రాజ్ కుమార్, ముద్రగడ శివకుమార్, జీజల ప్రభాకర్, నాగుల రాజ్ కుమార్, పూస ఈశ్వర్, కంటే సంపత్, రఘు, కూర శంకర్ తదితరులు పాల్గొన్నారు



# వీసీ ప్రొ. వివి.బసవ రావుకు సన్మానం

విశాలభారతి, ఓయూ:

ఇటీవలే రాయలసీమ యూనివర్సిటీ విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్ గా నియమితులైన ఓయూ టెక్నాలజీ కళాశాల రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ వి.వి.బసవరావు ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ అలుమిని అసోసియేషన్ అధ్వర్యంలో బంజారాహిల్స్ న్యూ ఎమ్మెల్యే కాలనీస్ వెల్ఫేర్ అసోసియేషన్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రొ. వి.వి.బసవరావు ని అభినందించారు. ఈ సందర్భంగా డా.సాదం ఐలయ్య రాసిన కవితను చదివి వినిపించాడు.తను రాసిన ఎ. లైఫ్ జర్నీ ఆఫ్ ఎ. ప్రొఫెసర్ వి.వి.బసవ రావు అను పుస్తకాన్ని బహుకరించారు అనంతరం ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ గా నియమితులైన ప్రొ. వి. రమేష్ కుమార్ ని, మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొ. పి. శశికళ ని సన్మానించారు. ఈకార్యక్రమంలో అల్యూమిని అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఎం రాజమహేందర్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ, సి.పి రాములు, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. వి రమేష్ కుమార్,పూర్వ అధ్యక్షులు మరియు టెక్నాలజీ కళాశాల పూర్వప్రిన్సిపాల్,ప్రొ.ఎస్.వెంకటేశ్వర్, శ్రీ ఎ.భాస్కర్ రెడ్డి, టెక్నాలజీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ప్రొ. డి.జయ ప్రకాష్ , ప్రొ. పి. శశికళ జాయింట్ సెక్రటరీ డాక్టర్ వి పవన్ కుమార్, ట్రెజరర్ విద్యా భూషణ్,యాదగిరి, డా. సాదం ఐలయ్య,డా. రవీంద్ర, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





# ఎలాంటి ఆంక్షలు లేకుండా పరస్పర బదిలీలు చేపట్టాలి

- **అంతర్ జిల్లా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులు**
- **ఇంకా ప్రభుత్వం నుండి రాని ఆదేశాలు**
- **ఆవేదన చెందుతున్నారు ఉపాధ్యాయులు**
- **తక్షణమే ప్రభుత్వం స్పందించి బదిలీలు చేపట్టాలి**
- **ఎస్టియూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్ కుమార్ డిమాండ్**

ఇబ్రహీంపట్నం,విశాలభారతి :


ఒకే సబ్జెక్టు బోధించే ఇద్దరు ఉద్యోగులు ఒకరి స్థానంలోకి మరొకరు పరస్పర అవగాహనతో బదిలీ అయ్యేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా పరస్పర బదిలీలు త్వరగా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘం ఎస్టియూటీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పుట్టపాక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గత సంవత్సరం డిసెంబర్ 1 నుండి 31 వరకు ఉద్యోగులు ఇతర జిల్లాలకు పరస్పర బదిలీలు వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఉద్యోగ ఉపాధ్యాయులను పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. పరస్పర బదిలీలు అందరికీ ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి ఎలాంటి నష్టం వాటిల్లదన్నారు. కేవలం కుటుంబాలకు దూరంగా ఉండటం వల్ల జీరో సర్వీస్ కు అయిన సిద్ధ పడ్డారని తెలిపారు . ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని వెంటనే ప్రభుత్వం స్పందించి పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్న అందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు.

# పోగొట్టుకున్న నగదును తిరిగి అప్పగింత

- **హయత్ నగర్ క్రైమ్ పోలీసులు**

పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:





ఆటోలో పోగొట్టుకున్న నగదును తిరిగి అప్పగించమంటూ వచ్చిన ఫిర్యాదు చేశారు. ఈమేరకు హయత్ నగర్ పోలీసులు సీసీ కెమెరాల సహాయంతో కనుగొని ఆదివారం తిరిగి బాధితులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే మహబూబ్ నగర్ కు చెందిన వీర సత్య మల్లేష్ తన భార్య శ్రీ సూక్ష్మ ఇద్దరూ ఆంధ్ర ప్రదేశ్ నుండి హయత్ నగర్ లో బస్సు దిగి లోకల్ ఆటో సహాయంతో సూర్య నగర్ లో గల తన స్నేహితుని ఇంటికి వెళ్లారు. కాసేపటి తరువాత చేతిలో ఉన్న హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మర్చిపోయామని తెలిసి వెంటనే ఆటో గురించి వెతకగా ఎటువంటి సమాచారం లభించకపోవడంతో బాధితులు హయత్ నగర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హయత్ నగర్ క్రైమ్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆటోను గుర్తించి విలువైన ఆభరణాలు, 14 వేల రూపాయల నగదు తిరిగి బాధితులకు అప్పగించామని సీఐ నాగరాజుగౌడ్ అడ్మిన్ ఎస్సై కె.వెంకట్ రెడ్డి తెలిపారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.